ప్రజలకు రేషన్ కష్టాలు షురూ

- చాలా చోట్ల ఈ-పోస్ యంత్రాల మొరాయింపు
- క్యూలైన్లలో ప్రజల ఇబ్బందులు



నరసాపురం రూరల్: పసలదీవిలో మాన్యువల్‌గా రేషన్ పంపిణీ



యలమంచిలి: పనిచేయని ఈ-పోస్ యంత్రం



నరసాపురం రూరల్: కొప్పర్రులో సర్వర్ పనిచేయక పోవడంతో రేషన్ డిపో వద్ద గంటల తరబడి వేచి చూస్తున్న లబ్ధిదారులు

యలమంచిలి: రేషన్ పంపిణీకి ఆదిలోనే హంసపాదు ఎదురైంది. ఈ-పోస్ పరికరాలు పని చేయకపోవడంతో ఆదివారం అట్టహాసంగా ప్రారంభించిన రేషన్ పంపిణీ సక్రమంగా పంపిణీ కాలేదు. యలమంచిలి మండలంలో 49 రేషన్ డిపోలు, నాలుగు సొసైటీలు కలుపుకుని మొత్తం 53 రేషన్ షాపులు ఉన్నాయి. అన్ని షాపుల్లోని ఈ-పోస్ పరికరాలు సక్రమంగా పని చేయలేదు. మండలంలో మొత్తం 23,456 రేషన్ కార్డులు ఉండగా ఆదివారం 1744 కార్డులకు మాత్రమే రేషన్ పంపిణీ చేశారు. మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట మధ్యలోనే ఒక మాదిరిగా ఈపోస్ పరికరాలు పని చేయడంతో ఆ మాత్రం కార్డులకు పంపిణీ చేశారు. రోహిణీ కార్తె ఎండలు మండిపోతుండటతో రేషన్ సరుకులు తీసుకోవడానికి వచ్చిన లబ్ధిదారులు ఈపోస్ పరికరం పని చేయకపోవడంతో ఉసూరుమంటూ వెను తిరిగారు. డీలర్లు సైతం ఈ-పోస్ పరికరం ఎప్పుడు పని చేస్తుందా? అనుకుంటూ ఎండను సైతం లెక్క చేయకుండా పరికరం ఎదుట కూర్చుని ఉదయం నుంచి సాయంత్రం వరకు తపస్సు చేసినా ఫలితం దక్కలేదు.

పెనుగొండలో..

పెనుగొండ: నిత్యావసరాల ప్రజా పంపిణీలో కూటమి ప్రభుత్వ నిర్ణయంతో లబ్ధిదారులకు రేషన్ పరేషాన్‌గా మారింది. ఐదేళ్ల పాటు ఇంటి వద్దకే రేషన్‌ను ఇంటికి చేర్చుతున్న వాహన వ్యవస్థను రద్దు చేసి జూన్ 1 నుంచి లబ్ధిదారులు రేషన్ షాపుల వద్దే బియ్యం తీసుకోవాలంటూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆదివారం రేషన్ షాపుల్లో బియ్యం పంపిణీ ప్రారంభించారు. దీంతో లబ్ధిదారులు షాపుల వద్ద బారులు తీరాల్సిన పరిస్థితి ఏర్పడింది. మండుతున్న ఎండల్లోనూ కిలో మీటర్ల మేర నడిచి వచ్చి రేషన్ తీసుకోవడానికి లబ్ధిదారులు నానా అవస్థలు పడ్డారు. ఆదివారం ప్రజా పంపిణీని ప్రారంభించినా పెనుగొండ, ఆచంట మండలాల్లో కొన్ని చౌక డిపోలు తెరచుకోలేదు. కొన్నింటిలో సర్వర్ ప్రాబ్లెమ్ రావడంతో గంటలు తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. ఆదివారం కావడంతో మొదటి రోజే రేషన్ తీసుకుందామనుకుని వచ్చిన లబ్ధిదారులకు నిరాశ ఎదురైంది. షాపు మూసి ఉండడంతో ఎండలోనే వెనుతిరిగి వెళ్లాల్సి వచ్చింది. కోరి తెచ్చుకొన్న తంటా అంటూ పెదవి విరుచుకొంటూ వెనుతిరిగారు.

కూటమి నాయకుల హడావిడి

పెనుగొండ, ఆచంట మండలాల్లో చౌక డిపోల వద్ద ఆదివారం కూటమి నాయకుల హడావుడి ఎక్కువ కావడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడ్డారు. ఇంటికే వచ్చే వ్యాన్‌లు రద్దు చేసి, డిపోల వద్దకు వచ్చి తీసుకోమని చేయడమే కాకుండా, ఘనకార్యం సాధించినట్లు కూటమి నాయకులు తొలిరోజు పలు డిపోల వద్ద దగ్గర ఉండి పంపిణీ చేయడంతో లబ్ధిదారులు బిత్తరపోయారు.

నరసాపురంలో..

నరసాపురం రూరల్: కూటమి సర్కారు ఎండీయూ వ్యవస్థను రద్దు చేసి రేషన్ షాపుల ద్వారా నిత్యావసర సరుకుల పంపిణీ పున: ప్రారంభం అంటూ ప్రజలను మభ్య పెట్టే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన మొదటి రోజే బెడిసి కొట్టింది. ఆదివారం అట్టహాసంగా చేపట్టిన ఈ కార్యక్రమం మండలంలోని చాలా గ్రామాలతోపాటు, పట్టణంలోని పలు వార్డుల్లో సైతం మమ అనిపించి తాళాలు వేశారు. నరసాపురం పట్టణంలో 30, మండలలో 60 వెరసి మొత్తం 90 రేషన్ షాపులు ఉండగా వీటి ద్వారా 40,980 మంది తెల్లరేషన్ కార్డు దారులకు 601 మెట్రిక్ టన్నుల బియ్యం ప్రతీ నెలా అందిచాల్సి ఉంది. అయితే అట్టహాసంగా ఆదివారం ప్రారంభించిన ఈ కార్యక్రమానికి సర్వర్లు మొరాయించడం, ఎండతీవ్రత, ఉక్కపోత ఎక్కువగా, పలు రేషన్ షాపుల వద్ద రాత్రి వరకూ సర్వర్ తిప్పలతో పెద్ద ఎత్తున లబ్దిదరాలు క్యూలు కట్టారు. పథకం ప్రారంభం రోజే సర్వర్లు పనిచేయక ఇబ్బందులు పడిన సిబ్బంది, అధికారులు ఎట్టకేలకు ఆ సమస్యను అధిగమించేదుకు మాన్యువల్ పద్దతిలో పలు చోట్ల రేషన్ సరఫరా చేయించారు. కూటమి ప్రభుత్వ కుతంత్రపు చేష్టలతో గత ఐదేళ్ల పాలనలో సజావుగా సాగిన సంక్షేమాన్ని మరోమారు ప్రజలు జ్ఞప్తికి తెచ్చుకున్నారు.

పెనుమంట్రలో..

పెనుమంట్ర: పెనుమంట్రలో 4వ నెంబర్ షాపులో ఉదయం ఎమ్మెల్యే ప్రారంభోత్సవం చేసిన అనంతరం సాయంత్రం ఆ డిపో వద్ద వినియోగదారులు బారులు తీరారు. కొన్ని డిపోలలో స్టాక్ నిల్వలతో ఇరుకుగదులనే సరుకులు ఇచ్చే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్యంగా ఆ డిపోల్లో సర్వర్‌లు పని చేయకపోవడంతో వినియోగదారులు గంటల తరబడి వేచి ఉన్నారు. మున్ముందు రేషన్‌సరుకులు తెచ్చుకోవడానికి ఇంకా ఎన్ని కష్టాలు పడాలో? అని వినియోగదారులు వాపోతున్నారు.



పెనుగొండ: ఎండలో రేషన్ కోసం వేచి ఉన్న లబ్ధిదారులు



పెనుమంట్ర: 4 వ నంబర్ షాపులో బారులు తీరిన లబ్ధిదారులు



పెనుమంట్ర: మల్లిపూడి చౌకడిపోలో రేషన్ ఇస్తున్న దృశ్యం

లబ్ధిదారులకు కష్టాలు మొదలు



పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో రేషన్ షాపు వద్ద వేచి ఉన్న లబ్ధిదారులు

పాలకొల్లు సెంట్రల్: రేషన్ లబ్ధిదారులకు నిత్యావసర కష్టాలు మొదలయ్యాయి. నిన్నటి వరకూ ఇంటి ముంగిటకు వచ్చిన రేషన్ సరుకులు నేడు ఊరి చివరకు వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మళ్లీ క్యూలైన్లు, వెయిటింగ్ తీసుకున్న సరుకులు తీసుకువెళ్లే వారి కోసం ఎదురుచూపులతో కష్టాలు మొదలయ్యాయి. ఇంకా విశేషం ఏమిటంటే 65 ఏళ్ల వారికి ఇంటికి తీసుకువెళ్లి ఇస్తామని చెప్పారు. ఈ రేషన్ షాపు వద్ద ఉన్న వృద్ధురాలిని మీకు ఇంటికి వస్తుంది కదా? అని ప్రశ్నించగా ఇందులో నా వయసు ఎంతుందో చూడు బాబు అని కోరింది. ఆమెకు 62 ఏళ్లు అయ్యో మరో మూడేళ్లు దాటి ఉంటే నాకు ఇంటికి సరుకులు వచ్చేవి ఈ వయసులో రేషన్ షాపుకు వచ్చి తీసుకోవాలంటే కొద్దిగ కష్టంగానే ఉందని కొంత నిరుత్సాహం వ్యక్తంచేశారు. ఇలా అనేక రేషన్ డిపోల వద్ద లబ్ధిదారులు ఎండలో నిలబడి బియ్యం కోసం తెచ్చుకున్న సంచులతో ఎండకు అడ్డం పెట్టుకున్నారు. కూడా తెచ్చుకున్న రేషన్ కార్డులతో విసురుకుంటూ కూర్చున్నారు.

హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం



పాలకొల్లు సెంట్రల్: వెన్నుపోటు దినం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మురళీ కృష్ణంరాజు, ఉమాబాల, జాన్సన్, గుడాల గోపి, తాతాజీ



పెనుగొండ: తూర్పుపాలెంలో వెన్నుపోటు దినం పోస్టరును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పాలకొల్లు సెంట్రల్: రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారం చేసి సంవత్సరమైనా ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమయ్యారని నరసాపురం పార్లమెంటు నియోజకవర్గ వైఎస్సార్ సిపి పరిశీలకుడే ముదునూరి మురళీకృష్ణంరాజు అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద ఇన్‌చార్జి గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) అధ్యక్షతన జూన్ 4న జరగనున్న వెన్నుపోటు దినం వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ గత జగనన్న ప్రభుత్వం ఇచ్చిన పథకాలను గాలికి వదిలేయడమే కాకుండా కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలోనూ పూర్తిగా విఫలమైందన్నారు. సంవత్సరం కాలంలో ప్రజలను మోసం చేసిన కారణంగా వైఎస్సార్ సీపీ అధినాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు జూన్ 4న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఎన్నికల్లో అందలం ఎక్కడం కోసం అనేక బూటకపు హామీలిచ్చిన చంద్రబాబు అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చారన్నారు. ఏడాది గడిచినా ఏ ఒక్క హామీని అమలు చేయలేకపోయారని విమర్శించారు. పార్టీ నాయకులపై అనేక అక్రమ కేసులు పెట్టి బెదిరిస్తున్నారని అయినా ఎవరూ అదరకుండా బెదరకుండా ప్రలోబాలకు లొంగకుండా గెలిపించుకున్న యలమంచిలి ఎంపీపీ ఎన్నిక విజయమే నిదర్శనమన్నారు. నరసాపురం పార్లమెంటు ఇంజార్జ్ గూడూరి ఉమాబాల మాట్లాడుతూ దళితులు, మైనారిటీలపై పోలీసుల సహాయంతో అక్రమ కేసులు, దాడులు చేసి చిత్రహింసలకు గురిచేస్తున్నారన్నారు. వెన్నుపోటు దినం కార్యక్రమం ఇన్‌చ్ఛాజ మేడిది జాన్సన్ మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో వెనుకడుగు వేయని ఏకైక నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని అన్నారు. ఇన్‌చార్జి గుడాల గోపి మాట్లాడుతూ ఇంటింటికీ రేషన్ కట్ చేయడంతో ఒక్క సంవత్సరంలోనే ప్రజల ఆనందం అటకెక్కిందన్నారు. వెన్నుపోటు దినం కార్యక్రమానికి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ శ్రేణులందరూ పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, పార్టీ నాయకులు యినకొండ రవి, కోరాడ శ్రీనివాస్, పెన్మెత్స ఏసు రాజు, కొత్రపాటి వీరాస్వామి, కర్రా జయసరిత, మద్దా చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండలో..

పెనుగొండ: కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్న ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలను చంద్రబాబు వెన్ను పోడిచారంటూ జూన్ 4న నిర్వహించబోయే వెన్నుపోటు దినం పోస్టరు ఆవిష్కరించారు. ఆదివారం తూర్పుపాలెంలోని క్యాంపు కార్యాలయం వద్ద మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆదేశాల మేరకు ఆచంట నియోజవకర్గ ప్రజా ప్రతినిధులు, నాయకులు వెన్నుపోటు దినం పోస్టరు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పోడూరు జెడ్పీటీసీ సభ్యుడు గుంటూరి పెద్దిరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి దంపనబోయిన బాబూరావు, ఆచంట మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్, గూడూరు దేవేంద్రుడు, నల్లిమిల్లి బాబిరెడ్డి, సర్పంచ్‌లు బోడపాటి బుల్లియ్య, కోట వెంకటేశ్వరరావు, కత్రి వేణుబాబు, పిల్లి రుద్ర ప్రసాద్, పోతుమూడి రామచంద్రరావు, పలివెల శ్రీను, సాకా సుబ్రహ్మణ్యం, సూర్యరెడ్డి, జక్కంశెట్టి చంటి, నంబూరి రాజా,చ కుచ్చర్లపాటి పద్మనాభ రాజుచ భూపతిరాజు శ్రీనివాస రాజు, పోడూరి రామయ్య, దొంగ దుర్గా ప్రసాద్, భవానీ ప్రసాదు, జక్కంశెట్టి శ్రీరాములు మేడిచర్ల పండు తదితరులు పాల్గొన్నారు.

వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



చినిమిల్లి చందు

నరసాపురం: ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు హామీలను అమలు చేయకుండా మరోసారి తన నైజాన్ని బయటపెట్టారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యూత్ విభాగం అధ్యక్షుడు చినిమిల్లి చందు అన్నారు. ఎన్నికల్లో ఎన్నో హామీలు ఇచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలను నిలువెల్లా చేసిన మోసానికి నిరసనగా ఈనెల 4న వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చేపట్టిన వెన్నుపోట దినం కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో విజయవతంత చేయాలని ఆయన కోరారు. టీడీపీ ఏడాది పాలనలో ప్రజలకు జరిగిన మోసాలను వివరిస్తూ వైఎస్సార్ సీపీ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవతంత చేయడం ద్వారా కూటమి ప్రభుత్వానికి కనువిప్పు కలిగించాలని అన్నారు.

నృత్య ప్రదర్శనలో విద్యార్థుల ప్రతిభ



షిర్డీ వేదికపై ప్రదర్శనలు ఇస్తున్న విద్యార్థులు

నరసాపురం: షిర్డీలోని బాబా సమాధి శతాబ్ది వేదికపై గత నెల 27 నుంచి నాలుగు రోజుల పాటు నిర్వహించిన కూచిపూడి నృత్యప్రదర్శనల్లో నరసాపురం శ్రీ ఆదిపరాశక్తి నృత్యనికేతనం విద్యార్థుల ప్రదర్శనలు అలరించాయి. నాట్యాచారిణి వలవల అనంతలక్ష్మీదేవి శిష్యులు శ్రీనిధి. సాత్విక, సాయిశ్రిత, అనన్య, యోగ్యశ్రీ, నందిని, ప్రణవి, తన్వికశ్రీ తదితరులు 50 మంది పాల్గొన్నారు. బాబా జీవిత విశేషాలతో కూడిన చిన్నారులు ఇచ్చిన నృత్య ప్రదర్శనలు ప్రశంసలు అందుకున్నట్టు అనంతలక్ష్మీదేవి చెప్పారు. షిర్డీలో నృత్య ప్రదర్శనలు ఇచ్చి వచ్చిన అనంతలక్ష్మీదేవితోపాటు శిష్య బృందాన్ని ఆదిపరాశక్తి నృత్యనికేతనం అధ్యక్షుడు కర్నల్ రావు, ఉపాధ్యక్షుడు ఆర్‌వీ సుబ్బారావు, కార్యదర్శి రంగినీడి సుబ్బారావు తదితరులు అభినందించారు.

అలరించిన జుత్తిగ విద్యార్థులు

పెనుమంట్ర: మండలంలోని జుత్తిగ గ్రామానికి చెందిన విద్యార్థులు షిర్డీలో నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. పెనుగొండకు చెందిన శ్రీవెంకటేశ్వర నృత్యనికేతన్ గురువు వినయ్‌కృష్ణ ఆధ్వర్యంలో ఆయన శిష్యులు షిర్డీలో జరిగే సాంస్కృతిక కూచిపూడి నృత్య ప్రదర్శనలో పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైభవంగా ధనకొండాలమ్మ జాతర



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

యలమంచిలి: మండలంలోని అడవిపాలెం, మేడపాడు, పెనుమదం, కొంతేరు గ్రామాల సరిహద్దులో వరి చేల మధ్యలో పాలకొలను సర్వేశ లింగం పొలంలో వెలసిన ధనకొండాలమ్మ అమ్మవారి జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఏడాదిలో ఒకరోజు మాత్రమే ఈ జాతర జరుగుతుంది. బాణసంచా కాల్పులు, మంగళ వాయిద్యాల నడుమ గరగల నృత్యాలతో అమ్మవారికి గ్రామోత్సవం చేశారు. జాతర సందర్భంగా ఆలయ ఆవరణలో అమ్మవారికి కుంభం పోశారు. చివరగా ఊయల ఉత్సవం చేసి అమ్మవారి ఘటాలను ఆలయ ప్రవేశం చేయడంతో జాతర ముగిసింది. దాతల సహకారంతో భక్తులందరికీ జాతర నిర్వహణ కమిటీ సభ్యులు అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

సందీప్‌కు అభినందనలు



సందీప్‌ను అభినందిస్తున్న గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)

యలమంచిలి: ఏనుగువానిలంక గ్రామానికి చెందిన మాజీ వలంటీర్ పాలపర్తి సందీప్ వైఎస్సార్ సీపీ వలంటీర్స్ వింగ్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా నియమితులైన సందర్భంగా ఆదివారం ఆయనకు వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) శాలువా కప్పి, పూలమాల వేసి అభినందించారు. గత ఎన్నికల్లో వలంటీర్‌కు రాజీనామా చేసి పార్టీ కోసం కష్టపడి పని చేసిన సందీప్ ఈ పదవికి పూర్తి అర్హుడని ఆయన కొనియాడారు. గోపీతో పాటు డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ నాయకులు ఇనుకొండ రవి, పొత్తూరి రంగరాజు, మామిడిశెట్టి చిట్టిబాబు, గుడాల సురేష్, పెచ్చెట్టి కృష్ణాజీ, కోరాడ శ్రీనివాసరావు, జోగాడ ఉమామహేశ్వరరావు, దేవ రాజేష్, చెన్ను విజయ్, పాలపర్తి కృపానాథ్, వీరా మల్లిఖార్జున తదితరులు సందీప్‌ను అభినందించారు.

అధ్వానంగా పారిశుద్ధ్యం



మార్కెట్ ప్రాంతం కోవెలగుడి వీధిలో మెయిన్‌రోడ్డుపై చెత్త కుప్పలు

నరసాపురం: నరసాపురం మున్సిపాలిటీలో పారిశుద్ధ్య నిర్వహణ నానాటికీ తీసికట్టు అనే విధంగా తయారైంది. 31 వార్డులు, 60వేలు జనాభాతో విస్తరించి ఉన్న పట్టణంలో మున్సిపల్ అధికారులు పారిశుద్ధ్య నిర్వహణలో పూర్తి అలసత్వం ప్రదర్శిస్తున్నారు. ఫలితంగా పట్టణంలో ప్రధానమైన మార్కెట్ ప్రాంతంలో కూడా రోడ్లుపై చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. ఇక పట్టణంలో ఎక్కడపడితే అక్కడ ఆవులు, దూడలు, పందులు రోడ్లపై తిరుగుతున్నాయి. అవన్నీ చెత్త కుప్పలు వద్దకు చేరుతుండటంతో పరిస్థితి మరింత దారుణంగా తయారవుతుంది. అధికారులు వార్డు పర్యటనంటూ హడావుడి చేస్తున్నా కూడా క్షేత్రస్థాయిలో మాత్రం మార్పు రావడంలేదు. ముఖ్యంగా శానిటరీ సెక్షన్ పనితీరు అధ్వానంగా ఉండటంతో ఈ పరిస్థితి తలెత్తిందని ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పరిస్థితి బాగు చేయాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

గుండెపోటుతో మత్తు డాక్టర్ శ్రీనివాస్ మృతి



నాగెళ్ల శ్రీనివాసులు

పాలకొల్లు సెంట్రల్: పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ నాగెళ్ల శ్రీనివాసులు (63) ఆదివారం ఉదయం గుండె పోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ముచ్చర్ల వారి తోటలో నివాసం ఉంటున్న డా. శ్రీనివాసులు మత్తు నిపుణులుగా పట్టణంలో గత 30 సంవత్సరాలుగా సేవలందిస్తున్నారు. తన చిన్న కుమారుడిని కాలేజీలో జాయిన్ చేయడానికి వాళ్ల బావమరిది ఇంటికి వెళ్లిన ఆయనకు ఆదివారం ఉదయం వాంతులు అవ్వగా బాత్రూమ్‌కు వెళ్లేలోపు అకస్మాత్తుగా పడిపోయారు. హుటాహుటిన స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లగా గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించినట్లు తెలిపారు. బుధవారం పాలకొల్లులో శ్రీనివాసులు అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు బంధువులు తెలిపారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

నరసాపురం: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ(మీ కోసం) కార్యక్రమం నిర్వహిస్తున్న నరసాపురం ఆర్డీఓ దాసి రాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలు నుంచి కార్యక్రమంలో ప్రారంభం అవుతుందని వివరించారు.

నేడు పెనుమంట్రలో వైఎస్సార్ సీపీ సమావేశం

పెనుమంట్ర: స్థానిక పెనుమంట్ర వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు తేతలి సుధీర్‌రెడ్డి కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ మండల స్థాయి సమావేశాన్ని సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండలపార్టీ అధ్యక్షుడు గూడూరి దేవేంద్రుడు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. బుధవారం నిర్వహించే వెన్నుపోటు దినం కార్యక్రమ ఏర్పాట్లపై ఈ సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. సమావేశానికి పెనుమంట్ర మండలంలోని వైఎస్సార్‌సీపీకి చెందిన అన్ని విభాగాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

రేషన్ పంపిణీ ప్రారంభం

పాలకొల్లు సెంట్రల్: రేషన్ వ్యాన్‌ల వద్ద ఎండలో నిలబడి, వర్షంలో తడిచి ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నామని లబ్ధిదారులు చెబుతున్నారని, అందుకే మళ్లీ రేషన్ షాపులు తెరిచామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఆదివారం పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు మండలం భగ్గేశ్వరం గ్రామంలో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మతో కలసి రేషన్ షాపుల వద్ద నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జేసీ టి.రాహుల్‌కుమార్ రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ పాల్గొన్నారు.

రేషన్ పంపిణీ ప్రారంభించిన ఎమ్మెల్యే

పెనుగొండ/పెనుమంట్ర: ఆచంట, పెనుగొండ, పెనుమంట్ర మండలాల్లోచౌకడిపోల వద్ద బియ్యం పంపిణీని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ ఆదివారం ప్రారంభించారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా లబ్ధిదారులకు నిత్యావసర సరుకులు అందించాలని కోరారు. అవస్థలు తొలగించడానికే ఎండీయూ వ్యవస్థను రద్దు చేసినట్టు చెప్పారు.

భూసారంతో అధిక దిగుబడులు



మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ ప్రసాద్

భీమవరం అర్బన్: భూసారం ఆధారంగా వరి సాగు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని పెదవేగి ప్రిన్సిపాల్ శాస్త్రవేత్త డాక్టర్ ఎంపీ ప్రసాద్ అన్నారు. భీమవరం మండలంలోని యనమదుర్రు గ్రామంలో ఆదివారం వికషిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా వరి, ఆక్వాసాగులో రైతులు అడిగిన పలు సందేహాలకు ఏడీఏ శ్రీనివాస్, శాస్త్రవేత్తలు సమాధానం చెప్పారు. అనంతరం పెదవేగి ప్రిన్సిపాల్ శాస్త్రవేత్త డాక్టర్ ఎంబీ ప్రసాద్ మాట్లాడుతూ రైతులు తప్పకుండా తమ పొలాల్లో భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. కొందరు రైతులు అలా చేయకుండా విచక్షణ రహితంగా ఎరువులు, పురుగు మందులు వాడటంతో భూమిలో ఉన్న పోషకాలు దెబ్బతినడమే కాకుండా సాగులో ఖర్చు ఎక్కువ అవుతుందన్నారు. సాగులో సాంకేతికతను అందిపుచ్చుకుని అధిక దిగుబడులిచ్చే నూతన వంగడాల గురించి రైతులు ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకోవాలన్నారు. ఖరీఫ్ సాగు సమీపిస్తుందని భూ సారం పెరిగేందుకు రైతులు పచ్చిరొట్ట, పశువులు, కోళ్ల ఎరువులు వేసుకుంటే అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో మార్టేరు, ప్రిన్సిపాల్ శాస్త్రవేత్త డాక్టర్ సుధీర్ రెడ్డి, మండల పశువైద్యాధికారి పి. పుండరీబాబు, వ్యవసాయ విస్తరణాధికారి బి దేవి స్వరూప తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్‌లో చాంబర్స్ కళాశాల గోల్డెన్ జూబ్లీ వేడుకలు



పూర్వ విద్యార్థుల సమావేశంలో మాట్లాడుతున్న కళాశాల చైర్మన్ కారుమూరి

పాలకొల్లు సెంట్రల్: చాంబర్స్ కళాశాల గోల్డెన్ జూబ్లీ వేడుకలు ఈ సంవత్సరంలో అక్టోబర్ నెలలో నిర్వహించే విధంగా సమాయత్తం అవుతున్నట్లు కళాశాల చైర్మన్ కారుమూరి వెంకట నరసింహరావు అన్నారు. ఆదివారం స్థానిక చాంబర్స్ కళాశాలలో (సిటఎస్‌ఏ) కోసా చాంబర్స్ ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ వేడుకలకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును ఆహ్వానించాలనే ఆలోచనలో ఉన్నామని తెలిపారు. సీఎం రాక కోసం వారి సమయాన్ని బట్టి ఆ తేదీలను ప్రకటిస్తామన్నారు. ఈ వేడుకలు రెండు రోజులు పాటు నిర్వహించాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. అనంతరం కోసా పూర్వ విద్యార్థి సంఘం కమిటీని రిజిస్ట్రేషన్ చేసినట్లు కమిటీ అధ్యక్షులు నాళం శ్రీనివాసగుప్త తెలిపారు. ఉపాధ్యక్షుడిగా కారుమూరి వెంకట శ్రీరామకృష్ణ, సెక్రటరీ గాదె వెంకట మల్లిఖార్జునరావు, జా. సెక్రటరీ చల్లా ఆదినారాయణమూర్తి, ట్రెజరర్ బుడి కృష్ణ తదితరులను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ సివివి సత్యనారాయణమూర్తి, కళాశాల సెక్రటరీ కేవీ సీతారామరాజు, ట్రెజరర్ రేపాక ప్రవీణ్ భాను పాల్గొన్నారు.

భగవద్గీతతోనే అసలైన జ్ఞానం

యలమంచిలి: దైవ జ్ఞానం ప్రకారం మానవుడు ఎప్పటికీ మారని జీవ కులంలోనూ, ఎప్పటికీ మారని దైవమతంలో ఉన్నాడని త్రైతసిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక మామిడికుదురు కమిటీ అధ్యక్షుడు బండారు సత్యనారాయణ అన్నారు. మండలంలోని ఏనుగువానిలంక గ్రామంలో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ త్రైత సిద్ధాంత జ్ఞాన గ్రంథాల ప్రచారం నిర్వహించారు. త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథం శ్రీకృష్ణుడి అసలైన జ్ఞానాన్ని తెలియజేస్తుందన్నారు. కార్యక్రమంలో హనుమంతరావు, బ్రహ్మజీ, సుబ్బారావు, శేషు, వెంకటేష్, జగదీష్, సత్యవతి, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.